ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





ఖరీఫ్ సాగు ముమ్మరం

- పనుల్లో నిమగ్నమైన రైతులు
- సాధారణ సాగు విస్తీర్ణం

1,38,877 హెక్టార్లు



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్ పంటలు ముమ్మరంగా సాగుతున్నాయి. కురుస్తున్న వర్షాలతో రైతులు సాగులో నిమగ్న మయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు దున్ని ఖరీఫ్ సాగు పనులు చేపట్టారు. వరి, సజ్జలు, మొక్క జొన్న, పత్తి, మినుము, పెసలు, కందులు, పొద్దు తిరుగుడు, పొగాకు సాగు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా జోరుగా కురుస్తున్న వర్షాలు రైతన్నల మోములో ఆశలు రేకిస్తున్నాయి. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1,38,877 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 34,612 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగు పనులలో నిమగ్నమమయ్యారు. వరి సాధారణ విస్తీర్ణం 14,078 హెక్టార్లు కాగా 811 హెక్టార్లలో సాగైంది. సజ్జలు 7,125 హెక్టార్లు కాగా 3,892 హెక్టార్లల్లో సాగుచేశారు.. మొక్క జొన్న 2464 హెక్టార్లు కాగా 1878 హెక్టార్లు సాగైంది. కొర్రలు 1373 హెక్టార్లు కాగా 1800 హెక్టార్లల్లో సాగు చేస్తున్నారు. పెసలు సాధారణ సాగు విస్తీర్ణం 1061 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 184 హెక్టార్లల్లో సాగు చేశారు. మినుములు 2530 హెక్టార్లకుగాను 222 హెక్టార్లల్లో సాగు అయింది. కంది సాధారణ సాగు విస్తీర్ణం 73,003 హెక్టార్లు కాగా 13,139 హెక్టార్లల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 544 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 301 హెక్టార్లల్లో సాగైంది. నువ్వులు 2790 హెక్టార్లకు గాను 2677 హెక్టార్లల్లో సాగు చేశారు. పొద్దు తిరుగుడు 161 హెక్టార్లకు కేవలం 28 హెక్టార్లలలో సాగు చేశారు. ఆముదం 1723 హెక్టార్లకు గాను 431 హెక్టార్లల్లో సాగు చేశారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 31,563 హెక్టార్లు కాగా 7505 హెక్టార్లల్లో సాగు చేశారు. ఖరీఫ్ పంటలు వేసేందుకు మరి కొంతకాలం సీజన్ ఉండటంతో ఆయా పంటల విస్తీర్ణాలు పెరిగే అవకాశం ఉంది.

వైసిపిలో నిలిచేదెవరు ? ఎంత మంది వచ్చే ఐదేళ్లూ నిలబడతారు? పార్టీకోసం పోరాడేదెంతమంది ? అప్పటి వరకూ నిలుస్తారా? లేదా? అన్నదే ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ప్రశ్నార్ధకంగా మారింది. అధికారం పోయాక ఒక్కసారిగా వైసిపి పరిస్థితి తారుమారైంది. సిద్ధం సభలకు తరలించిన జనం ఓటేయలేదనే విశ్లేషణలూ ఆపార్టీని అగాధంలో పడేశాయి. ఇపుడు పార్టీ ఫిరాయింపులు, రాజీనామాలు, నేతల అసంతృప్తులు కలవర పెడుతున్నాయి.

వైయస్ఆర్ కాంగ్రెస్

వైసిపిలో నిలిచేదెవరు?

- పత్తాలేకుండా పోయిన పోటీ చేసిన అభ్యర్థులు
- అధికారం లేనందున పార్టీని వీడుతున్న స్థానిక సంస్థల ప్రతినిధులు
- ఐదేళ్లూ ప్రతిపక్షంగా గట్టిగా నిలబడిన టిడిపి నేతలు
- రెండు నెలల్లోపే జండాలు మార్చుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు గట్టిగా పోరాడారు. ఐదేళ్లూ నిలబడ్డారు. వీరోచిత పోరాటాలు చేయలేకపోయినా పార్టీ పరంగా క్యాడర్‌ను నిలబెట్టుకున్నారు. వైసిపి ప్రభుత్వ దాడులు, కేసుల నుంచి పార్టీనేతలను, క్యాడర్‌ను చంద్రబాబు కాపాడుకున్నారు. ప్రతిష్టాత్మకంగానే ఎదుర్కొన్నారు. జిల్లాల్లోనూ నేతలు గట్టిగానే నిలబడ్డారు. ఆస్తులు, వ్యాపారాలపై దెబ్బకొట్టినా తట్టుకున్నారు. కోర్టులకు వెళ్లి న్యాయపోరాటాలు చేశారు. అరెస్టులు, నిర్బంధాలు తట్టుకున్నారు.గ్రానైట్ వ్యాపారాలున్న నేతలపై గట్టిగానే పగపట్టారు. అన్నీ స్తంభింపచేసినా నిలబడ్డారు. పార్టీ కార్యక్రమాలు, మహానాడు, లోకేష్ పాదయాత్ర వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టారు. నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం నేతలు వైసిపి ప్రభుత్వ వేధింపులను తట్టుకుని నిలబడ్డారు. ఇపుడు వైసిపి నేతలు అందుకు భిన్నంగా ఉన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులే పత్తాలేకుండా పోయారు. గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. జిల్లాలో పార్టీని నడిపించే నేతలు కరువయ్యారు. వేధింపులు ,కేసులు మొదలు కాకుండానే వైసిపి నేతలు పార్టీ జెండాలు మార్చేస్తున్నారు. అంతా తెలుగుదేశం బాటపట్టారు. పార్టీ అధికారంలో ఉన్నపుడు మంత్రులు, ఎమ్మెల్యేల శిబిరాల్లో అన్నీ తామై నడిపించిన కీలక నేతలు కూడా ఇపుడు పార్టీలు మారుతున్నారు. ఇదే ఆశ్యర్యంగా ఉంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వచ్చే ఐదేళ్లు ఎంత మంది నిలబడతారనేదీ ప్రశ్నార్ధకంగా మారింది. అధినేత జగన్ నిర్ణయాలు కూడా అదే విధంగా ఉన్నాయనే చర్చ సాగుతోంది. ఎన్నికలు తర్వాత పార్టీనేతలతో సమావేశాలు పెట్టడం, జిల్లాల్లో క్యాడర్‌ను నిలబెట్టుకునే చర్యలు ఏమీలేవు. అంతా ఏకపక్ష నిర్ణయాలు, ఉపన్యాసాలు చేయడం తప్ప పార్టీ పునాదులను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు లేవు. స్థానిక సంస్థల్లో పోటీచేసి గెలిచిన వైసిపి అభ్యర్థులు అందరూ వివిధ వ్యాపారాల్లోఉన్నారు. సంపాదించుకుంటూ పార్టీలో పోటీ చేసి గెలిచారు. ఇపుడు వారి వ్యాపారాలకు దెబ్బ తగులుతుందనే భావనతో తెలుగుదేశంలో చేరుతున్నారు. పిలవకపోయినా వస్తున్నారనే చర్చ సాగుతోంది. మున్సిపాల్టీల్లో వైసిపి పాలక వర్గాలున్నాయి. ఇపుడు అందరూ కట్టకట్టుకుని వచ్చేస్తున్నారు. ఎందుకంటే అధికారం లేకుంటే ఏమీచేయలేకపోవడంతోపాటు అధికారులనుంచి సహకారం ఉండదని తెలుసు.పైగా వ్యాపారాలపై తెలుగుదేశం నేతలు దృష్టిసారిస్తే దివాళా తీస్తామనే భయం కూడా వెంటాడుతోంది. ఒంగోలులో మాజీ మంత్రి బాలినేనికి అంతరంగికులుగాఉన్న కార్పొరేటర్లు కూడా

▶ 2లో

దిగుబడి తగ్గి.. ధరలు లేక..

- వర్షాభావంతో ఎండుతున్న తోటలు
- పెట్టుబడులు కూడా రాని వైనం
- నష్టాల్లో కూరుకుపోతున్న నిమ్మ రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిమ్మ పంట ఏడాదికి సుమారు ఆరు కాపులు వస్తుంది. వేసవి సీజన్‌లో వచ్చే కాపుకు మంచి గిరాకీ ఉంటుంది. సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకూ నిమ్మ కాయలకు మంచి ధర లభిస్తుంది. నిమ్మకాయల నుంచి పలు ఉత్పత్తులలు తయారు చేస్తారు. నిమ్మ తొక్కలను ఎండబెట్టి కూడా పొడి తయారు చేస్తారు. ఈ పొడిని ఔషధాలు, సబ్బుల తయారీలో వినియోగిస్తారు. కాయల నుంచి రసం నీటిలో కలుపుకొని తీసి తాగుతారు.

ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవలేదు. బోర్లలో నీటి మట్టం పడిపోయింది. దీంతో నిమ్మ తోటలన్నీ బెట్టకొచ్చాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు 40 బస్తాల దిగుబడి రావడం కూడా గగనంగా మారింది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో సుమారు 2 వేల ఎకరాల్లో నిమ్మతోటలు సాగువుతున్నాయి. యర్రగొండపాలెం మండలపరిధిలోని సాయిబాబా నగర్, వీరాయిపాలెం, యర్రగొండపాలెం, వీరభద్రాపురం, మిల్లంపల్లి, పుల్లలచెరువు మండలంలోని పుల్లలచెరువు, రాచకొండ, పెద్దారవీడు మండలంలోని తోకపల్లి, త్రిపురాంతకం మండలంలోని కేశినేనిపల్లి, విశ్వనాధపురం తదితర గ్రామాల్లో నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. నిమ్మ పంట వేసిన రైతుల పరిస్థితి ఈ ఏడాది దయనీయంగా మారింది. గత రెండేళ్లుగా గిట్టుబాటు ధర లేక వరుసగా దెబ్బతిన్న రైతులు ఈ ఏడాది మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో నాలుగు డబ్బులు వస్తాయని ఆశించారు. అయితే ధరలు పడిపోయింది. మొన్నటి వరకూ కేజీ నిమ్మ కాయలు రూ.70 పలికింది. ప్రస్తుతం రూ.15 పడిపోయింది. దీంతో నిమ్మ రైతులు నష్టాల్లో కూరుకు పోతున్నారు. ఎకరానికి రూ. 70 వేల వరకూ

▶ 2లో



దిగుబడి రాని నిమ్మతోట



నిమ్మ కాయలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించండి

- త్వరలో ఉద్యమ కార్యాచరణ
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును దేశ ప్రజ లంతా వ్యతిరేకించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇస్లాం పేటలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం విద్యావేత్త, న్యాయ వాది షేక్ కరిముల్లా సమన్వయ కర్తగా వ్యవహరించారు, సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక ముస్లిం వ్యతిరేక చట్టాలు రూపొందించడంతోపాటు ముస్లింలపై భౌతిక భావజాల పరమైన దాడులు ప్రభుత్వ పెద్దల కన్నుసన్నలలో జరుగుతున్నా

▶ 2లో

శివనగర్ కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం

డంపింగ్ యార్డులను తలపిస్తున్న కాలనీ పరిసరాలు ● దోమల విజంభన -పందుల స్వైర విహారం ● వ్యాధుల భయంతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ రెండో వార్డు పరిధిలోని శివనగర్ కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. కాలనీలోని పరిసర ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపించేలా దర్శనమిస్తున్నాయి. దోమల విజంభనకు తోడు పందుల స్వైర విహారం చేస్తుండడంతో వ్యాధుల భయంతో కాలనీ ప్రజలు అల్లాడుతున్నారు.

కాల్వలు శుభ్రం చేయరు.. చెత్తను తొలగించరు

శివనగర్ కాలనీలోని సైడ్ కాల్వలను నెలకు ఒకసారి అయినా శుభ్రం చేయని కారణంగా పూడిక, చెత్త, మురుగుతో నిండిపోతున్నాయి. ఎలుక ఎక్కిరించినట్లు నాలుగు నెలలకు ఒకసారి శుభ్రం చేస్తారు. అది కూడా నామమాత్రంగా చేసి చేతులు దులుపు కొంటారు. ఫలితంగా మురుగు రాజ్యమేలుతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప కాలువలు శుభ్రం చేసేందుకు పారిశుధ్య సిబ్బంది కదలరు. ఒకవేళ కాలువలు శుభ్రం చేసినా తూతూమంత్రంగా చేసి ఆ చెత్తను రోడ్లమీద వదిలిపెట్టి వెళ్తారు. కాలువలలో తీసిన చెత్త అక్కడ నుంచి తరలించకపోవడంతో యథావిధిగా తిరిగి ఆ చెత్త కాలువలోకి చేరుకోవటం పరిపాటిగా మారింది.

డంపింగ్ యార్డును తలపించేలా కాలనీ పరిసరాలు

నివాసాలలో వచ్చే చెత్తను మున్సిపల్ చెత్త సేకరణ సిబ్బంది క్రమంగా సేకరించకపోవడంతో ఆ చెత్త కాలనీలోని ఖాళీగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు వేయడం వల్ల కాలనీ పరిసరాలు డంపింగ్ యార్డులను తలపించేలా దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాంతాలలో నిల్వ ఉన్న చెత్త నుంచి వెలువడుతున్న దుర్గంధంతో ప్రజలు ముక్కు మూసుకొని ఆ ప్రాంతాల గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



సైడ్ కాల్వలలో పేరుకుపోయిన చెత్త, మురుగునీరు

దోమల విజృంభన.... పందుల స్వైర విహారం

కాలనీలో పారిశుధ్యం పడకేయడంతో సైడ్ కాలువలలోని మురుగు నీరు రోడ్లమీద పారుతోంది. దీంతో సైడు కాలువలు, రోడ్లమీద మురుగు నిలువ ఉన్నచోట దోమలు నివాసాలు ఏర్పరచుకుంటున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు విజృంభిస్తూ ప్రజలను వ్యాధుల బారిన పడేలా చేస్తున్నాయి. ఇక పందులు డంపింగ్ యార్డును తలపిస్తున్న ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకొని ఉంటూ రోడ్ల వెంబడి సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు, పందుల వలన ఎక్కడ భయంకరమైన వ్యాధుల బారినపడతామో అని అల్లాడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

ఫాగింగ్ చేయరు.. బ్లీచింగ్ చల్లరు

దోమల నివారణకు చేపట్టవలసిన కార్యక్రమాలు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరగటం లేదు. ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లడం వంటివి అసలు మరచిపోయారు. బ్లీచింగ్, ఫాగింగ్ కోసం నిధులు మాత్రం ఖర్చయిపోతుంటాయి తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం పనులు జరగవు. దోమలపై దండయాత్ర, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటూ ప్రచారాలు ఆర్భాటంగా చేసుకుంటూ చేయవలసిన పనులు చేయకుండా చేతులు దులుపుకోవడం మున్సిపల్ అధికారులకు తంతుగా మారిందని ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి కనిగిరి మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడేలా పారిశుధ్య పనుల నిర్వహణ మెరుగుపడేలా చూడాలని శివనగర్ కాలనీ ప్రజలతో పాటు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల ప్రజలు కోరుకుంటున్నారు.

దిగుబడి తగ్గి.. ధరలు లేక..

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టినట్లు రైతులు వాపోతున్నారు. దిగుబడి, ధరలు పడిపోవడంతో పెట్టుడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కూలీ కూడా రాదని అరకొరగా కాసిన కాయలు చెట్లకే వదిలేస్తున్నారు.

పెట్టుబడులు పెరిగి.. ధరలు తగ్గి...

నిమ్మకాయల ధర మొన్నటి వరకూ ఆశాజనకంగా ఉంది. బస్తా కాయల ధర రూ. 2,200 నుంచి రూ. 3,000 వరకూ పలికింది. అంతలోనే ధర పడిపోయింది. ప్రస్తుతం రూ. 1.200 నుంచి రూ. 1,400 మాత్రే పలుకుతోంది. ధరలు లేకపోవడంతో పెట్టుబడులు పెరగడంతో నష్టాలు తప్పేలా లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెరిగిన ఖర్చులు

నిమ్మ కాయలు ఇక్కడ నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు రైతులు తీసుకెళుతున్నారు. బస్తా పొలం నుంచి తీసుకురావడానికి రూ. 10, అక్కడి నుంచి హైదరాబాద్ రవాణా చేసినందుకు ట్రాన్స్‌పోర్టు వాళ్లకు రూ. 107, ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద నుంచి మార్కెట్‌కు తరలించే కూలీ రూ. 10, కోత కూలీల ఇతర ఖర్చులు రూ. 75, మార్కెట్‌లో సరుకు అమ్మిక ఏజెంట్లకు కమీషన్ రూపంలో 10 శాతం చెల్లించాలి. బస్తా కాయలు అమ్మినందుకు కమీషన్ రూ. 50 పోతుంది. ఇతర ఖర్చులతో కలుపుకొని దాదాపు బస్తాకు రూ. 450 వరకూ ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అన్ని ఖర్చులు భరించి బస్తా నిమ్మ కాయలు అమ్మితే వచ్చేది రూ.500 నుంచి రూ. 700 లేనని వారు వాపోతున్నారు.

దిగుబడి పడిపోయింది

ముప్వా రమాకాంత్ చక్రవర్తి, నిమ్మరైతు, సాయిబాబా నగర్



ఎనిమిది ఎకరాల్లో నిమ్మ తోటలు సాగు చేశాను. నిమ్మ దిగుబడులు దారుణంగా పడిపోయాయి. కాయలు లేక తోటలు వెలవెలబోతున్నాయి. ఏడాదికి ఆరు కాపులు వస్తున్నా దిగుబడి సరిగా ఉండడం లేదు. వేసవిలో వచ్చే పంట రైతుకు ప్రధానమైనది. వేసవిలో నిమ్మకాయలకు గిరాకీ ఉంటుంది. కానీ ఈ ఏడాది ధర ముంచింది. భూగర్భ జల మట్టం పడిపోవడంతో పూత, పిందె రాలిపోయాయి. ఫలితంగా దిగుబడి పడిపోయింది.

ధరలు గిట్టుబాటు కావడం లేదు

నిడుమోలు వెంకటేశ్వరరావు, నిమ్మరైతు, వీరాయిపాలెం



పది ఎకరాల్లో నిమ్మ తోటలు సాగు చేశాను. ప్రస్తుతం నిమ్మ కాయలకు ధర లేదు. దిగుబడి కూడా లేదు. మొన్నటి వరకూ బస్తా కాయలు ధర రూ. 3000 పలకిలింది.ప్రస్తుతం రూ. 1400లోపే పలుకుతుంది. ప్రతి రోజూ మార్కెట్‌కు 500 బస్తాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం 200 బస్తాలే వస్తున్నాయి.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించండి

(మొదటిపేజీ తరువాయి)

యన్నారు. వీటిని మైనార్టీ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్పటికీ ఆర్‌ఎస్ఎస్ మైనార్టీల పట్ల వ్యవహరించదల్చుకున్న వైఖరిని అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చినట్లు తెలి పారు. సవరణ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. వక్తలు మాట్లాడుతూ లక్షలాది ఎకరాల ఉన్న వక్ఫ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతమవుతున్నా వాటిని కప్పిపుచ్చి అనేక కట్టు కథలు చెబుతున్నారన్నారు. వక్ఫ బోర్డుపై అనేక అనుమా నాలు కలిగించేలా సామాజిక మాధ్యమాల దుష్ప్రచారాలు చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సవరణ చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. ఈ చట్టాన్ని నిరసిస్తూ త్వరలోనే ఉద్యమ కార్యాచరణ తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ హుస్సేన్, షేక్ ఖాజా, మహమ్మద్ సాధిక్, డాక్టర్ నూకతోటి రవికుమార్, అబ్దుల్ రవూఫ్,కరీమ్ బేగ్, న్యాయవాదులు షేక్ సందాని, అబ్దుల్ నబీ. ఆరీఫ్ ఖాన్ పాల్గొన్నారు..

నాట్లు ప్రారంభమైనా తొలగించని గుర్రపు డెక్క

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనది. కానీ మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సీజన్లకు ముందే రైతులు కాలువల మరమ్మత్తులు తోపాటు నీటిపారుదలకు అడ్డంగా ఉన్న తూటు కాడ, గుర్రపు డెక్క తొలగించాలని రైతులు అనేకమార్లు ప్రభుత్వ అధికారులను కోరారు. గత ప్రభుత్వ పాలనలో కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కాలువల్లో గుర్రపు డెక్క అడ్డుపడి నీటి పారుదలకు ఆటంకమై ఎక్కడికక్కడ కాలువ కట్టలకు గండ్లు పడి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. నూతన ప్రభుత్వ మైనా రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులు కాలువలకు మరమ్మత్తులు చేయించలేదు. కానీ కాలువలో పెరిగిన గడ్డికి మందులు పిచికారి చేయించారు. కానీ అత్యంత ప్రధానమైన మురుగు కాలువలో మాత్రం అధికారులు ఎలాంటి మందులు పిచికారి చేయకపోవడంతో గుర్రపు డెక్క మరింత పెరిగిపోయి మురుగు కాలువలను పూడ్చేసింది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమై వరి నాట్లు వేస్తుండటంతో సమస్య కనిపించకపోయినప్పటికీ వరి నాట్లు పూర్తయి వర్షాలు అధికమైతే ఈ గుర్రపు డెక్క నీటి పారుదలకు ఆటంకంగా మారి పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్దేపల్లి గ్రామం నుండి ప్రారంభమై ఐలవరం, కలగాల మీదుగా గూడవల్లి, గంగోలు మురుగు కాలవలో కలిసే కనగాల అప్లోయేట్ మురుగు కాలువ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఐలవరం గ్రామం వద్ద బాడవ పొలాలకు వెళ్లే ప్రాంతంలోని వంతెనకు ఇరువైపులా గుర్రపు డెక్క పెరిగిపోయి నీరుపారుదలు కాక నిలిచిపోయి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే మురుగు కాలువల పరిస్థితి ఈ విధంగా ఉంటే మరో మూడు నెలల పాటు కొనసాగాల్సిన వర్షాకాలం పంటల పరిస్థితి తలుచుకుంటే భయమేస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి ఏపుగా పెరిగివున్న అప్లుఎంట్ కాలువలోని గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుచున్నారు.



ఎమ్మెల్యే బీఎన్‌ను కలిసిన సిఐ అజయ్ కుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు: సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్‌ను ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఆయన నివాసంలో ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14 వరకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో శిక్షణ తరగతు లు జరుగుతాయని మండల పరిషత్ కార్య పర్యవేక్షకులు షేక్ రహీం తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయ న్నారు. గ్రామ సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఇన్ఛార్జి ఎంపీడీఓగా ప్రసాద్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా కార్యాలయ ఏవో డిఎస్‌వి ప్రసాద్‌ను జిల్లా పరిషత్ శాఖ అధికారులు నియమించారు. ప్రస్తుత ఎంపీడీవో ఎం శ్రీహరి ఎన్నికల ప్రక్రియ అనంతరం రాష్ట్ర జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వారి సొంత జిల్లా అయిన నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో ఎం శ్రీహరి రిలీవ్ కాగా ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఏవో డిఎస్‌వి ప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు.

వైసిపిలో నిలిచేదెవరు..?

(మొదటిపేజీ తరువాయి)

ఇపుడు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో తెలుగుదేశంలో చేరుతున్నారు. పాలకవర్గం మొత్త వైసిపి ఆధీనంలోనే ఉంది. దీన్ని నిలుపుకునే పరిస్థితి లేదు.అంతా డీలా పడిపోయారు. బాలినేని కూడా ఇక్కడ ఉండటంలేదు. ఆయన భవితవ్యంపైనా తర్జనభర్జన సాగుతోంది. ఎన్నికల ఫలితాల తర్వాత ఒకసారి వచ్చిపోయారు. ఉండేవాళ్లు ఉండండి? పోయేవాళ్లను నేను ఆపలేను కదా? అని ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీ క్యాడర్‌లో గందరగోళం లేపాయి. మరోవైపు ఆయన అధిష్టానంతో విభేదాలతో ఇప్పటికీ వైసిపి అధినేత జగన్‌ను కలవలేదు. జిల్లానేతలతోనూ సంప్రదింపులు చేయడంలేదు.పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్నారు.దీంతో ఇక్కడ బాలినేని గెలుపుకోసం అహర్నిశలు చివరి నిమిషం వరకూ పనిచేసిన నేతలు కూడా తెలుగుదేశంలో చేరుతున్నారు. అందుకు క్యూ కట్టారనే చెప్పొచ్చు. ప్రస్తుతానికి స్థానిక సంస్థల్లో పాలకవర్గాలు మార్చకుండా జీవో తెచ్చారు. దాన్ని రద్దుచేసే వరకూ ఎలాంటి మార్పులు కూడా చేపట్టే వీల్లేదు.అయినా కూడా వైసిపి నుంచి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు దూకుతున్నారు. ఇక తెలుగుదేశం నేతలు కూడా రాజకీయంగా ప్రతిపక్షాన్ని బలహీనం చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. గతంలో వైసిపి నేతలు చేసిన ఆగడాలు, దౌర్జన్యాలు,కేసులు, వేధింపులను దృష్టిలో పెట్టుకుని ప్రతికార చర్యగానే వీటిని భావిస్తున్నారు. ఒంగోలులోనే ఎన్నికలకు ముందూ, ఇపుడూ ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రి బాలినేని మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. రాజకీయంగా ఇక్కడే ఉత్కంఠ పరిస్థితులు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అవన్నీ ఇపుడు ప్రభావం చూపుతున్నాయి. వైసిపి అధిష్టానం, జిల్లా నేతలు ఇదే పంథాలో ఉంటే రానున్న ఐదేళ్లలో కాదు గదా...ఏడాదికే పార్టీ ఖాళీ అవడం ఖాయమనే విశ్లేషణలు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి
వారి కోర్టులో
E.A. NO 143/22 IN E.P.NO: 41/16 IN O.S.NO 47/12

గంగిశెట్టి శేషగిరి ...పిటిషనరు/డి. హెచ్. ఆర్

VS

కాసుల యోగేశ్వరరావు (డైడ్) మరి ముగ్గురు
...రెస్పాండెంట్లు/ జె.డి. ఆర్లు

To

1) కాసుల లక్ష్మీకుమారి **w/o** యోగేశ్వరరావు
2) కాసుల ఉమా నాగలక్ష్మి **D/o** యోగేశ్వరరావు
3) కాసుల మహేశ్వరి **D/o** యోగేశ్వరరావు
అద్దంకి గ్రామం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు పిటీషన్ లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా పై నంబరు పిటిషన్ తేది 28-8-2024 కి మీ నోటీసు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున మీరు తేది 28-8-2024 న ఉదయం గం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని వకీల్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో //

అద్దంకి
తేది 11.8.24

ఇంటూరి హనుమంతరావు
బి.కాం,.బిఎల్.
పిటిషనరు తరఫు అడ్వకేట్, అద్దంకి.
సెల్ నెం **9849045636**



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలుట్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పాలుట్ల గిరిజన గూడెంలో గంజివారిపల్లి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి విజయ భాస్కర్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న రోగులకు రక్తపరీక్షలు చేశారు. వాంతులు, విరేచరాలు, ఒళ్లు నొప్పులు, దగ్గు తదితర వ్యాధులతో బాధ పడుతున్న వారికి వైద్య సేవలు చేశారు. రక్తహీనతతో బాధనడుతున్న వారికి ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు పంపిణీ చేశారు. గర్భిణీలకు, చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేశారు. విష జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జానారెడ్డి, అశోక్ నాయక్, సుజాత, మాధవిలత, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్వామి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం చినవెంకన్నపాలెంలో పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు. పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం నాయకులతో మాట్లాడారు.

శరత్ బాబుకి డాక్టరేట్

ప్రజాశక్తి - కొమరోలు

13 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, బాదినేనిపల్లె గ్రామానికి చెందిన లొక్కు శరత్ బాబుకి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ, జర్మనీ వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన ఓ కార్యక్రమంలో శరత్ బాబుకు యూనివర్సిటీ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన శరత్ బాబును గ్రామస్థులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తల్లిదండ్రులు నాకు చెప్పిన మంచి మాట.. 'నిన్ను వలే నీ పొరుగువారిని ప్రేమించు' అనే మాటతో దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు ప్రారంభించినట్లు తెలిపారు. నా స్నేహితుల సహకారంతో గత 13 సంవత్సరాలుగా ఎంతో మంది సేవ చేశానన్నారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, కిరాణా దుకాణాలు, కరోనా సమయంలో నిత్య అన్నదానం, రక్తదానం చేయించడం, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఇల్లు కట్టించడం, వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందించడం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశానన్నారు. దీనికి గౌరవంగా నాకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల పట్టణానికి చెందిన ముత్తలూరి శివ శంకరాచారికి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఈ మేరకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈయన మోటారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. 1994 నుంచి ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో వెయ్యి దాకా పౌరాణిక నాటికలు ప్రదర్శించి ప్రజా మన్ననలు పొందారు. పలు అవార్డులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో పాండిచ్చేరిలోని ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసేందుకు ఐదుగురిని ఎంపిక చేసింది. ఎంపిక చేసిన వారిలో శివ శంకరాచారి ఒకరు. ఈ సందర్భంగా శివశంకరాచారిని పలువురు అభినందించారు.

మంత్రి చొరవతో రహదారికి మోక్షం

నర్రావారిపాలెం రోడ్డు పనులకు శ్రీకారం

గ్రామస్థులకు తొలగిన ఇబ్బందులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నర్రవారిపాలెం ప్రజలు తమ గ్రామానికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేకి సంబంధించి మూడో లైను నిర్మాణం జరగడంతో ఆ గ్రామానికి గతంలో వేసిన తారు రోడ్డు సైతం తొలగించారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో పోరాటాలు చేసినా ఆ గ్రామానికి రోడ్డు మంజూరు కాలేదు. ఇటీవల గ్రామస్తులు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, సచివాలయ వాలంటీర్ల వయోవద్ధుల శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసి సమస్యను వివరించారు. గ్రామంలోకి స్కూలు బస్సు సైతం రాక పిల్లల్ని బడికి పంపేందుకు కూడా అవస్థలు పడుతున్నామని, ఏమైనా జరిగితే 108 వాహనం వచ్చే పరిస్థితి కూడా లేదని వివరించారు. దీంతో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తక్షణమే ఆ గ్రామానికి రోడ్డు వేసే విధంగా చూడాలని, తాత్కాలికంగా జెసిబి ద్వారా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. దీంతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, టీడీపీ సోమరాజుపల్లి అధ్యక్షుడు శీలం సుబ్రహ్మణ్యం(చంటి) గ్రామస్తులతో కలిసి జెసిబి ద్వారా నర్రవారిపాలెంకి వెళ్లేందుకు పాకల రోడ్డు వరకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి కతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం మండలం అల్లూరు పంచాయతీ పరిధిలోని అల్లూరు - చేజర్ల రోడ్డులో ముదిగొండ వాగుపై రూ.8.26 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఒంగోలు ఎమ్మెల్యే దామర జనార్ధన్, ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. అలాగే మండలంలో మిగిలిపోయిన పంచాయతీ రోడ్లను కూడా పరిశీలిస్తున్నట్లు వారు తెలియజేశారు. గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు షేక్ రియాజ్, బలగాని వెంకటేశ్వరరావు, జంపన్న రామచంద్ర గౌడ్, గేనం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన రాజు అన్నారు. టంగుటూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవటం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవను స్మరించుకున్నారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చేలా వారి తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గ్రంథపాలకుడు కోరారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష, ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా ఈ నెల 13న హైదరాబాద్‌లో జరగనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని కత్తి ఐజక్ మాదిగ కోరారు. ఆదివారం యర్రగొండపాలెం ఇశ్రాయిల్ పేటలో ర్యాలీ సమాయత్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం కన్వీనర్ చేదూరి వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి వినయ్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు అశోక్ మాదిగ, నాయకులు కోటా ప్రకాష్, కె జాన్, వెంకట్రావు, చేదురి రవి, కె గురవయ్య, కె.దేవయ్య, కన్న, లారెన్స్, డేవిడ్, కిషోర్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలిషింగ్ యూనిట్ యజమానులు సహకరించాలి



గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు సంక్షోభం నుంచి కోలుకునే వరకు యజమానులు సహకరించి ప్రతి ఆదివారం సెలవు దినంగా అమలు చేయాలని చీమకుర్తి ఏరియా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు చీమకుర్తిలోని పలు పాలిషింగ్ యూనిట్లను పరిశీలించారు. ఇటీవల చీమకుర్తి మండలంలోని పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘాల సమావేశంలో పలు నిర్ణయాలు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సంఘం నాయకులు యూనియన్ పరిధిలోని పాలిషింగ్ యూనిట్లను పరిశీలించారు. ప్రతి ఆదివారం సెలవు దినంగా అమలు చేయాలని, పరిశ్రమ సంక్షోభం నుంచి కోలుకునే వరకు యూనియన్ నిర్ణయాలను పాటించాలన్నారు. యూనియన్ సమిష్టిగా తీసుకునే నిర్ణయాలను అమలు చేయాలన్నారు. ఎవరైనా యూనియన్ నిర్ణయాలను అతిక్రమిస్తే జరిమానా విధించబడుతుందన్నారు. యజమానులు పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర కుమార్, జిల్లా ప్రతినిధి కందిమళ్ళ గంగాధరరావు, గౌరవాధ్యక్షుడు గోగినేని నాగయ్య, ఎస్‌కె అహ్మద్ బాషా, నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, ఎస్‌కె అబ్‌సాలేహా, ఎస్‌కె రఫి, పి.సురేష్, గోరంట్ల చెన్నయ్య పాల్గొన్నారు.



మృతి చెందిన తంగెళ్ల మరియమ్మ

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-కొండపి

బైక్‌పై వెళ్తున్న మహిళను కట్టెల ట్రాక్టర్ తగలడంతో మహిళ మృతి చెందిన సంఘటన కొండపి-పెదకండ్ల గుంట గ్రామాల మధ్య జరిగింది. ఎస్ఐ కృష్ణబాజి తెలిపిన వివరాల ప్రకారం.. పెదకండ్లగుంటకు చెందిన యలమంద తన కుమార్తె తంగెళ్ల మరియమ్మ(31)ను ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని కొండపికి వస్తున్నాడు. కనిగిరి మండలం పెదారికట్ల నుంచి కట్టెల ట్రాక్టర్ కొండపి మండలం ముప్పవరం గ్రామానికి వస్తోంది. ట్రాక్టర్‌ను క్రాస్ చేసే క్రమంలో యలమంద బైక్‌పై ఉన్న మరియమ్మకు కట్టెలు తగలడంతో ట్రాక్టర్ ట్రక్కు కింద పడిపోయింది. ఆమెపై ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి యలమంద అవతలి వైపుకు పడడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతి చెందిన మరియమ్మ ప్రతి ఆదివారం తండ్రి వాహనంపై కొండపి వచ్చి బస్సులో ఒంగోలులోని కల్వరి చర్చికి వెళ్తుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఆదివారం కూడా ఒంగోలు వేళ్లేందుకు ద్విచక్రవాహనంపై కొండపి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారంతో కొండపి ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని మరియమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాడిచెర్ల గ్రామం సమీప పొలాలలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కొమరోలు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుండి రూ.3,080 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్టా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం, వెంకటాపురం గ్రామంలో పేకాట శిబిరంపై గిద్దలూరు అర్బన్ సీఐ వై వి సోమయ్య తన సిబ్బందితో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,800 నగదును స్వాధీనం చేసుకుని వారిని గిద్దలూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లుగా సీఐ తెలిపారు.



ట్రాఫిక్‌తో నిలిచిన వాహనాలు

పెద్దదోర్నాలలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. నిత్యం కర్నూలు, శ్రీశైలం వైపుకు వెళ్లే వందలాది వాహనాలు, బస్సులు, ఆటోలు సెంటర్‌లో నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీనికి తోడు తోపుడు బండ్ల వ్యాపారులు సైతం రోడ్డు మీదకు వచ్చి బండ్లు నిలుపుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరుతున్నారు.


రహదారులను శుభ్రం చేయిస్తున్న సర్పంచి కృష్ణమోహన్

రహదారులకు మరమ్మతులు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీ పరిధిలోని రోడ్లు వర్షాల కారణంగా నీరు, మట్టి చేరి రోడ్లకు ఇరువైపుల చెట్లు పెరగడంతో ప్రజలు, వాహనదారులు, ఆర్టీసీ బస్సులకు ఇబ్బందికరంగా మారాయి. సర్పంచ్ టి కృష్ణమోహన్ మూడు పొక్లైన్లతో రోడ్డుకు ఇరువైపుల చెట్లు తొలగించి గుంటలు పూడ్పించి ఆదివారం శుభ్రం చేయించారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - వేమూరు


తహశీల్దారు లక్ష్మి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులు ఈ నెల 16నుండి సెప్టెంబర్ 4 వరకు వివిధ గ్రామాల్లో కొన సాగుతాయని తహశీల్దారు లక్ష్మి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు ఆయా గ్రామ సచివా లయాల వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. 16న పోతు మర్రు, పులిచింతలపాలెం, 20న అబ్బన, గూడవల్లి, 21న బలిజేపల్లి, 22న చదలవాడ, 23న వరాహపురం, 24న పెనుమర్రు, 28న కుచెళ్ళపాడు, 29న వేమూరు, 30న చావలి, 31న పెరవలి, సెప్టెంబర్ 3న పెరవల్లిపాలెం, 4న జంపని గ్రామాల్లో సచివాలయాల వద్ద సదస్సులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమాలకు ఆయా పంచాయతీ పరిధిలోని అధికారులు పాల్గొనాలని తహశీల్దారు తెలిపారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మధుసూదన్ ప్రసాద్

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు


మండలంలోని అద్దేపల్లి దళితవాడలో ఆంధ్రా క్రీస్తు లూదరన్ చర్చి పుననిర్మాణం నిమిత్తం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్ తన వంతు ఆర్థిక సహాయాన్ని ఆదివారం చర్చి పెద్దలకు అందజేశారు. ఈసందర్భంగా చర్చి పెద్దలు, నాయకులు మాట్లాడారు. చర్చి పునర్నిమాణానికి ఆర్థికంగా సహకరించిన నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ అధ్యక్షులు బట్టు మల్లిఖార్జునరావు, టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, ఎస్సి సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జంగం శ్యాంసన్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కర్ణ శ్రీనివాసరావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు గొట్టుముక్కల లెనిన్, ఎస్సి సెల్ కార్యదర్శి పోకూరి సురేంద్రకుమార్, అద్దేపల్లి పారిస్ ఫాస్టర్ మద్దిరాల ఆనందరావు, సంఘ పెద్దలు చీకటి మరియదాసు, పప్పుల ప్రసాద్, నీలా డేవిడ్, కామాల శ్రీను, కంభం రమేష్, కనపర్తి సురేష్, కసుకుర్తి భాస్కరరావు, పప్పల మనోజ్, కనుమూరి సంసోన్, కసుకుర్తి దుర్గరావు పాల్గొన్నారు.

గొర్రెలు,మేకల పెంపకం దారులకు రూ.10వేల కోట్లు కేటాయించాలి

- జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి
- చీరాలలో జిఎంపిఎస్ జిల్లా ప్రథమ మహాసభ
- జివాల పెంపకం దారులను ఆదుకోవాలని తీర్మానం
- హాజరైన ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం బడ్జెట్లో గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంక్షేమానికి రూ.10వేల కోట్లు కేటాయించాలని, ప్రతి పెంపకం దారునికి 50శాతం రాయితీతో రూ.5లక్షల రుణం ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఎపి గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభకు హాజరైన ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య మాట్లాడారు. గొర్రెలు, మేకలు లక్షల నగదుతో కొనుగోలు చేస్తున్నప్పటికీ పెంపకం దారులు వాటికి భీమా మాత్రం చేయించడం లేదని అన్నారు. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందువల్ల జివాలకు భీమా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. గొర్రెలు, మేకల సంరక్షణ కోసం అవసరమైన మందులు ప్రభుత్వం ద్వారా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం హయాంలో బీసీలందరినీ ఆదుకునేలా ఒక చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. సమాజాన్ని చైతన్య పరచాలంటే చదువు ఒకటే మార్గమని చెప్పారు. కావున పెంపకం దారులు వారి పిల్లలను చదివించాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా తాను అన్నివేళలా అండగా ఉంటానని అన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, ఎం వసంతరావు, ఎన్ బాబురావు మాట్లాడారు. రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు లక్షలాది కుటుంబాలు జివాల పెంపకం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వానికీ రూ.వందల కోట్లు ఈ వృత్తి నుండి ఆదాయం వస్తున్నా వీరు సంక్షేమానికి నిధుల కేటాయింపులు తగినంతగా లేకపోవడంతో వృత్తి దార్లు అనేక ఇబ్బందులకు గురవు తున్నారని అన్నారు. వర్షాల సీజన్ ప్రారంభమైనందున అన్ని గ్రామాల్లో మూతి జబ్బులు, కాలు కుంటు వ్యాధులు


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వస్తున్నాయని అన్నారు. వీటి నివారణకు అన్ని పశువుల హాస్పిటళ్లలో తగినన్ని మందులు అందుబాటులో ఉంచి వైద్యం సౌకర్యం అందించి జీవాలను కాపాడాలని కోరారు. మేత, నీళ్లు, వైద్యం, భీమా, రుణాల సమస్యలు ఉన్నాయని అన్నారు. వీటిని పరిష్కరించడం ద్వారానే జివాల పెంపకం వృత్తి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమ కోసం రాబోయే బడ్జెట్లో రూ.10వేల కోట్ల నిధులు కేటాయించా లని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వచ్చే వ్యాధుల నివారణకు నాణ్యమైన టీకాలు, డి వార్మింగ్ ముందులు ఇచితంగా ప్రణాళిక సిద్ధం చేసి ఇవ్వాలని కోరారు. ఏడాదికి 4 సార్లు నట్టల నివారణ మందులు, కనీసం రెండు సార్ల సాధారణ వాక్సినేషన్ ఉచితంగా వేయాలని కోరారు. ఆర్వియులకు నెలకు రూ.10వేల విలువైన పశు వైద్య మందులు ఇవ్వాలని అన్నారు. మందుల్లో కల్తీలను నివారిం చాలని, కల్తీలకు పాల్పమతిన్న కంపెనీలను కాంటాక్ట్ నుంచి తొలగించాలని అన్నారు. ఉపాధి పథకం ద్వారా గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించా లని కోరారు. పెంపకం దారులకు 90శాతం గొర్రెలు, 70శాతం మేకలకు సబ్సిడీ నిర్ణయించడం ఆర్థికంగా వెనుక బడిన గొర్రెలు, మేకల పెంపకందారులకు భారం అవుతుం దని అన్నారు. కావున గొర్రెలు, మేకలు పెంపకం దారులకు కూడా 90శాతం సబ్సిడీతో ఉపాధి పోమీ నిధులతో షెడ్లు నిర్మించాలని కోరారు. పొలాల్లో జివాలను మేపుకునే పెంపకం దారులకు జివాల రక్షణకు వలలు ఇవ్వాలని కోరారు. ఒక్కోజీవానికి రూ.10వేల నష్టపరిహారం ప్రభుత్వ మే ఇవ్వాలని అన్నారు. పెండింగులో ఉన్న నష్టపరిహార నిధులు విడుదల చేయాలని కోరారు. పెంపకం దారులకు ఎక్స్ గ్రేషియో పథకాన్ని పునరుద్ధరించాలని అన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రమాదాల వలన మృతిచెందిన గొర్రెల కాపరులకు రూ.20లక్షలు, సాదారణ మరణాలుకు రూ.5లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో టీకాలు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గొర్రెలు, మేకల ప్రాథమిక సహకార సంఘాలకు 559, 1016 జిఒల ప్రకా రం 5 నుంచి 25 ఎకరాలు స్థలం కేటాయించాలన్నారు. ఊరు ఉమ్మడిగా ఉన్న పశువుల మేత భూములు కాపాడా లని కోరారు. భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 50ఏళ్ల నిండిన పెంపకం దారులుకు పెంక్షన్ మంజూరు చేయాలని కోరారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టం తేవాలని అన్నారు. జిఎంపిఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో బాపట్ల ఏరియా అధ్యక్షులు మద్దిన శేషు, రైతు సంఘం నాయకులు తల్లపనేని రామారావు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు గవిని వెంకటరావు, చీరాల మండల అధ్యక్షులు మసనం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కడియం మణికంఠ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగయ్య

విద్యార్థుల అభివృద్ధే రేపటి దేశప్రగతి

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు చిన్న వయసు నుండి చదువుతో పాటు మానవతా విలువలు పెంపొందించుకోవాలని విశ్వ మానవ సంక్షేమ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ మస్తానరావు అన్నారు. పేరాల గాంధీ నగర్లో జెవివి, విశ్వ మానవ సంక్షేమ సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్ను ఆయన ఆదివారం సందర్శించారు. ఏకలవ్య ట్యూషన్ సెంటర్ పేరుతో గిరిజన విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు మహనీయులు, జాతీయోద్యమ నాయకల చరిత్ర నుండి మంచి విలువలను నేర్చుకోవాలని సూచించారు. పండిడ్ జవహర్లాల్ నెహ్రూ చెప్పిన విధంగా ఈదేశ భవిష్యత్ అంతా తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని అన్నారు. నేటి విద్యార్థులు మంచి విలువలను పెంచుకోవడం ద్వారా మంచి సమాజం నిర్మాణం అవుతుందని అన్నారు. మహనీయుల స్ఫూర్తితోనే విశ్వ మానవ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యాపితగా ట్యూషన్ సెంటర్లను నిర్వహిస్తుందని



మాట్లాడుతున్న రాష్ట్ర కో ఆర్డినేటర్ మస్తానరావు

అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి ప్రశ్నించే తత్వంతో పాటు సైంటిఫిక్ టెంపర్ పెంచుకోవాలని అన్నారు. మూఢ విశ్వాసాలు విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ బాబురావు, డిబిఆర్సి కో ఆర్డినేటర్ వి భగవాన్ దాస్, ట్యూషన్ కో ఆర్డినేటర్ నూతలపాటి సుజిత, కె నిరంజన్ పాల్గొన్నారు.

చిన్నారికి టిడిపి నేతల ఆశీర్వాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన మాచర్ల నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి కుమార్తె తేజస్విని పుష్పాలంకరణ వేడుకల్లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ నాయకులు బట్టు మల్లికార్జునరావు, జొన్నాదల వెంకటేశ్వరరావు, కూరపాటి రఘురామయ్య, కొల్లూరు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారిని ఆశీర్వదిస్తున్న టిడిపి నాయకులు


సాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

వృద్ధ దంపతులకు చేయూత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బిచ్చమెత్తుకొని జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులకు తాముమన్నామంటూ హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో చిన్న డేరాలో నివాసం ఉంటున్న 70ఏళ్ల బొచ్చు పోలయ్య, గురవమ్మ దంపతులు గత కొన్నేళ్లుగా బిచ్చమెత్తుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన పోలయ్య నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమవడంతో గురవమ్మ ఒక్కతే బిచ్చమెత్తుకొని భర్తను పోషించుకుంటుంది. వీరి దీన పరిస్థితి చూసి చలించిన హెల్పింగ్ హాండ్స్ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఖాదర్ వలి, గుర్రం శ్రీనివాసరావు కమిటీ సభ్యులతో కలిసి పోలయ్య, గురవమ్మ దంపతులకు రూ.5వేలు నగదు సహాయం అందజేశారు. ప్రభుత్వం అందించే పెన్షన్ కూడా వీరికి అందడం లేదని తెలిసి హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు నివ్వెరపోయారు. నిలువ నీడ లేక దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులకు పెన్షన్ అందజేసి ఆదుకోవాలని కోరారు. అధికారులు స్పందించి వృద్దులు ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కన్నెగంటి శ్రీను, పుట్ట అయ్యప్పస్వామి, శిల్పాల కోటేశ్వరరావు, షేక్ హబీబ్, పసుమర్తి కరిముల్లా, సిహెచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మార్కా'పుర' పీఠాన్ని ...

వదులుకుంటారా..! నిలబెట్టుకుంటారా..!

- ఏకాభిప్రాయానికి రాని వైసిపి నేతలు
- అవకాశం కోసం టిడిపి ఎదురు చూపు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కా'పుర' పీఠం వివాదం ఇప్పట్లో సమసిపోయేలా కనిపించడం లేదు. మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ వ్యవహారశైలిని మెజార్టీ స్వపక్ష కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఛైర్మన్, స్వపక్ష కౌన్సిలర్ల మధ్య నానాటికీ దూరం పెరుగుతోంది. ఛైర్మన్, కౌన్సిలర్ల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేలా వైసిపి నేతలు చొరవ తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత మున్సిపల్ ఎన్నికల్లో కుదుర్చుకున్న ఒప్పందాన్ని మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ తుంగలో తొక్కారని స్వపక్ష కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. చిర్లంచెర్ల మూడు సంవత్సరాలు ఛైర్మన్‌గా కొనసాగాలని... తరువాత కాలంలో 4వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మున్సిపల్ ఛైర్మన్‌గా కొనసాగాలని అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి నిర్ణయించారు. అప్పట్లో కుదిరిన ఒప్పంద సమయం ముగియనుండటంతో ఛైర్మన్ పీఠం వ్యవహారం తాజాగా చర్చకు వచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు అటు ఇటుగా మారారు. మార్కాపురం నుంచి కుందురు నాగార్జునరెడ్డి గిద్దలూరుకు బదిలీ కాగా... గిద్దలూరు నుంచి అన్నా వెంకటరాంబాబు ఇక్కడికి బదిలీ అయ్యారు. వారిద్దనూ ఓటమిపాలయ్యారు. వైసిపి కూడా అధికారాన్ని కోల్పోయింది. దీంతో మున్సిపల్ ఛైర్మన్ పదవిపై అప్పట్లో జరిగిన ఒప్పందంపై ఇద్దరు మాజీ


మున్సిపల్ కార్యాలయం

ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి రాలేదని తెలిసింది. మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జిగా అన్నా వెంకటరాంబాబు, గిద్దలూరు ఇన్‌ఛార్జిగా కుందురు నాగార్జునరెడ్డి కొనసాగుతున్నారు. వైసిపి కౌన్సిలర్లు అంతా కుందురు నాగార్జునరెడ్డి అనుచరులే. మార్కా'పుర' పంచాయతీ అన్నా రాంబాబుకు పరిధిలో ఉందని కుందురు నాగార్జునరెడ్డి... కౌన్సిలర్లు అందరూ కుందురు నాగార్జునరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఎంపిక చేసిన వారే కదా... వారి మాటకే ఎక్కువ విలువ ఇస్తారని అన్నా వెంకట రాంబాబు అంటున్నట్లు సమాచారం. వీరిద్దరూ ఏకతాటిపై నిలబడితే మున్సిపల్ పంచాయతీ తెగడం పెద్ద కష్టమేమీ కాదు.

మున్సిపల్ ఛైర్మన్‌గా డాక్టర్ కనకదుర్గకు అవకాశం కల్పిస్తే తమకు అభ్యంతరం లేదని మెజార్టీ కౌన్సిలర్లు చెబుతున్నారు. ఛైర్మన్‌గా మాత్రం చిర్లంచెర్ల బాలమురళీకృష్ణను కొనసాగించడం మాత్రం తమకు ఇష్టం లేదని వాదిస్తున్నారు. చిర్లంచెర్లను ఛైర్మన్ పదవి నుంచి దింపాల్సిందేనని వైసిపి కౌన్సిలర్లు గట్టి ప్రయత్నంలో ఉన్నారు.

వైసిపిలో వర్గ విబేధాలను టిడిపి ఎప్పటికప్పుడు గమనిస్తోంది. ఛైర్మన్ పీఠం కోసం ఎదురు చూస్తోంది. అవకాశం వస్తే వదులు కోబోమని టిడిపి నేతలు చెబుతున్నారు. చిర్లంచెర్లపై స్వపక్ష కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగురవేయడంతో... వారందరితో టిడిపి మంతనాలు జరిపినట్లు తెలిసింది. తమకు సహకరించాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు ప్రతిఫలం ఉంటుందని ప్రలోభపెట్టినట్లు తెలిసింది. టిడిపిలోకి వెళ్లేందుకు సుమారు 15 మంది కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. వైసిపి నేతలు తమ నిర్ణయాన్ని... అప్పట్లో జరిగిన ఒప్పందాన్ని పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని వైసిపికి చెందిన ఓ కౌన్సిలర్ చెప్పారు. వైసిపి నేతలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తే ఒకటి లేదా రెండు నెలల్లో ఛైర్మన్ పీఠం టిడిపి పరం అయ్యే అవకాశం ఉంది. అవిశ్వాసం వరకు వస్తే నాలుగేళ్ల తరువాతైనా ఛైర్మన్ పీఠం తమదేనని, వైసిపి కౌన్సిలర్లు ఇచ్చిన హామీతో టిడిపి బలంగా చెబుతోంది. వైసిపి నేతలు మార్కా'పుర' పాలనను వదులుకుంటారో... నిలబెట్టుకుంటారో వేసి చూడాల్సిఉంది.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రముఖ స్త్రీ వ్యాధుల నిపుణులు డాక్టర్ శాంత కుమారి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శరీరంలో వచ్చే మార్పుల నేపథ్యంలో బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రముఖ స్త్రీ వ్యాధుల నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి సూచించారు. శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఒంగోలు గొడుగుపాలెం లోని ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంత కుమారి మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలికల శరీరంలో మార్పులు ప్రారంభమవుతాయన్నారు. అందువల్ల వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వివిధ వయస్సులలో సాధరణంగా వచ్చే వ్యాధులపై చర్చించి నివారణా మార్గాలను సూచించారు. విద్యార్థినులు నిత్యం వ్యాయామం చేయాలని,


పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ శాంతకుమారి

పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కౌమారదశలో వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివత్తి చేశారు. అనంతరం హాస్టల్‌లో చదువుకుంటున్న బాలికలందరికీ ప్రత్యేకంగా తయారుచేసిన నోట పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ధనలక్ష్మి, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, సిబ్బంది నాగండ్ల చిరంజీవి, సున్నపు తిరుపతి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడా సంబరాలను శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటములను సమాన దష్టితో స్వీకరించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. క్రీడా సంబరాలలో భాగంగా బాలికలకు ఖో-ఖో, టగ్-ఆఫ్-వార్, టెన్నికాయిట్, మ్యూజికల్ ఛైర్స్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. అనంతొర విజేతలను


పోటీలు ప్రారంభిస్తున్న గోరంట్ల రవికుమార్

అభినందించారు. క్రీడా పోటీలను ఎస్‌కె. జిలాని బాషా ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాదాసు వినోద్, డేవిడ్, ఆనంద్, రవి, రామారావు, నవీన్, సంజయ్, శ్రీహరి, రామారావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ శివకోటి రెడ్డి, ఆర్కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ జి.అజయ్ కుమార్, శివారెడ్డి, కళాశాల డీన్ దాది ఆంజనేయులు, ప్రిన్సిపల్ రమేష్, ఎంఎస్‌ఆర్, కరణం నారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

- లైసెన్సు లేని వాహనాలు సీజ్
- ట్రాఫిక్ సిఐ వై.పాండురంగారావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఒంగోలు ట్రాఫిక్ సిఐ వై.పాండు రంగారావు సూచించారు. ట్రాఫిక్ సిఐగా వై.పాండు రంగారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఎస్‌పి దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలు, నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను, ఓవర్ స్పీడ్ గా వెళ్ళే ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ వాహనాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ఆటోలు విధిగా పోలీస్ గుర్తింపు నెంబర్ కలిగి ఉండాలన్నారు. పెద్ద సౌండ్స్ వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్‌లు, సైరన్స్ అమర్చి శబ్ద కాలుష్యం సష్టించి ఇతర వాహనదారులు, ప్రజలకు భయాన్ని కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్సర్ అమ్మే వాళ్ళు, బిగించే మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామని, అతి వేగం,మద్యం సేవించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు హాని కలిగించవద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ , రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న సిఐ పాండురంగారావు


టిడిపిలో చేరిన కార్పొరేటర్ శైలజా దంపతులు

టిడిపిలో చేరిన వైసిపి కార్పొరేటర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైసిపికి చెందిన స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ టిడిపిలో చేరారు. ఒంగో లు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమక్షంలో శైలజ, ఆమె భర్త బేతంశెట్టి హరిబాబులు ఆదివారం టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే, ఎంపీలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని ఎస్‌వికెపి కళాశాలలో 1976-1979 డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చాలాకాలం తరువాత పూర్వ విద్యార్థులు ఒక వేదికపై చేరి ఒకరినొకరు పలుకరించుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు డాక్టర్ ఇమ్మడిశెట్టి బాలసుబ్బారావు, వి.బాలరత్నం, జి.శంకర్ నారాయణ, బి.సుందర ప్రసాద్, పి.రాధాకృష్ణమూర్తి, కాశీరత్నం, పలువురు అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టుల స్థితిపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వం జరిపిన సర్వే, ప్రాజెక్టులు, నిధులు, కొత్త ప్రాజెక్టులపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ రైల్వే ప్రాజెక్టుల పరిధి పలు రాష్ట్రాల సరిహద్దుల వెంట వెళతాయని తెలిపారు. రాష్ట్రాల వారీగా కాక రైల్వే జోనళ్ళ ప్రకారం సర్వేలు- మంజూరులు, నిర్మాణాలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 17 కొత్త, 24 డబ్లింగ్/రెట్టింపు రైల్వే ప్రాజెక్టులు రూ.73,743 కోట్ల ఖర్చుతో 5,329 కిలోమీటర్ల పొడవున పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. 2024 మార్చి నాటికి రూ.24,156 కోట్లతో 1,006 కిలోమీటర్లు నిర్మించి అప్పగించామన్నారు. గతి శక్తి ప్లాన్‌లో గత 4 సంవత్సరాలలో మంజూరైన 9 కొత్త లైన్లు, 29 డబ్లింగ్/రెట్టింపు రైల్వే ప్రాజెక్టుల సర్వేలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టులకు 2009- 2014 వరకూ బడ్జెట్‌లో రూ.886 కోట్లు కేటాయించామన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.8,406 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ. 9,151 కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు. 2009 నుండి 2014 వరకు 363 కిలోమీటర్లు, 2014 నుండి 2024 వరకు 1,510 కిలోమీటర్ల లైన్ల పనులు ప్రారంభించామన్నారు. ఈ మధ్య ప్రారంభించిన అమ్రిత్ భారత్ స్టేషన్ పథకంతో ఎన్నికైన స్టేషన్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకంలో 73 స్టేషన్లు ఎంపిక య్యాయన్నారు. ప్రకాశం జిల్లాలో ఒంగోలు, సింగరాయకొండ, గిద్దలూరు, దొనకొండ, కంభం మార్కాపురం ఉన్నాయని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి కార్యకర్తలు

వైసిపి నేతల నిరసన

ప్రజాశక్తి - పర్చూరు

విజయవాడలోని అంబేద్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్యని వైసీపీ మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక బొమ్మల సెంటర్లోని అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహంపై దాడికి వ్యతిరేకంగా బొమ్మల సెంటర్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రమేష్, ఒగ్గిశెట్టి ప్రసాద్, లంకా శివ, కంచనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, తులసి శివ నాగేశ్వరరావు, గేరా స్వరాజ్ కుమార్, కూరకుల చెంచు, కాకి అశోక్, బిళ్ళా రాజేష్, విజయ్, మద్దిరాల శాంతారావు, యెహోషువ, నల్లమోతు శ్యాంబాబు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న విఆర్‌కె ట్రస్ట్ సభ్యులు

రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలం జువ్వపాలెం గ్రామం కొత్తగూడెంకు చెందిన గాజులేటి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబాన్ని వేములపల్లి రవికిరణ్ ఆదివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి తమ విఆర్‌కె ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వేములపల్లి రాఘవేంద్ర, వేములపల్లి రత్న గోపాలరావు, కొత్తపల్లి శ్రీధర్, పొన్నపల్లి బాబు రాజేంద్ర ప్రసాద్, భూపతి వెంకటేశ్వరరావు, దున్న సతీష్, దున్న శ్రీనివాసరావు, దున్న సద్గుణ రావు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

నూతన కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి - రేపల్లె

హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వాసవి కల్చరల్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గ సభ్యులచే ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షులుగా కాలేపల్లి ఈశ్వరబాబు, ప్రధాన కార్యదర్శిగా తడికమల్ల బలరామ శ్రీను వాసు, కోశాధికారిగా తూనుగుంట్ల రాజేష్, గౌరవాధ్యక్షులుగా మట్టుపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా పొన్నూరు మల్లికార్జునరావు, వంకాయల వెంకట రామకృష్ణ, పొన్నూరు శ్రీనివాసరావు, ఎండూరి శివరామకృష్ణ, మానేపల్లి వెంకట సాయి మల్లికార్జునరావు, వేముల రామకోటేశ్వర రావు, కోశాధికారిగా గుర్రం సురేష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, తూనుగుంట్ల పాండురంగారావు, డాక్టర్ వేముల దినేష్ కుమార్, పొన్నూరు గౌరీ రామకుమారి, మద్ది పద్మజ, తూనుగుండ్ల సాయిబాబా పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ బ్రిడ్జి లేక రైలుపేట ప్రజల పాట్లు

- రెండేళ్ల క్రితం ఫుడ్ బ్రిడ్జి తొలగింపు
- అర్జీలు పెట్టినా పట్టించుకునే వారు లేరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సగం వరకు తొలగించిన కాలినడక వంతెన



ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న రైలుపేట ప్రజలు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద ఉన్న రైలుపేట నుండి పట్టణానికి వెళ్లేందుకు ఉన్న కాలినడక వంతెన రైల్వే విస్తరణ పనుల్లో భాగంగా ఏడాది క్రితం తొలగించారు. దీంతో రైలుపేట నుండి ప్రధాన పట్టణానికి వెళ్లే పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. పట్టణాన్ని రైలు పట్టాలు రెండు భాగాలుగా విడగొట్టడంతో సుమారు 8వార్డుల పరిధిలో 20వేల మంది ప్రజలు పట్టణానికి చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. 60ఏళ్ల క్రితం రైల్వే స్టేషన్ వద్ద రైలుపేట పార్క్ ప్రధాన రహదారిని కలుపుతూ కాలినడక వంతెన రైల్వే శాఖ నిర్మించింది. ఈ కాలినడక వంతెన మీదుగా రైలుపేట నుండి ప్రధాన పట్టణానికి వెళ్లేందుకు ప్రజలకు ఉపయోగపడుతుంది. అయితే రెండేళ్ల క్రితం రైల్వే స్టేషన్ విస్తరణ పనుల్లో భాగంగా ఈ వంతెనను రైలుపేట వైపు సగానికి తొలగించారు. దీంతో ఈ ప్రాంతం నుండి పట్టణానికి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైలుపేట నుండి సరైన రవాణా సౌకర్యం లేక మధ్యలో రైల్వే పట్టాలు ఉండడంతో ఇక్కడ నుండి ఆటో సౌకర్యం వంటివి లేవు. ఇక పట్టణ నడిబొడ్డు అంబేద్కర్ సర్కిల్, పాత బస్టాండు నుండి ఆటోల్లో రావాలంటే రూ.100 నుండి రూ.150 వరకు ఆటో చార్జి చెల్లించాల్సి వస్తుంది. అయినప్పటికీ సకాలంలో రవాణా సౌకర్యం లేక రైలుపేట ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రైలుపేట నుండి పట్టణ ప్రధాన కేంద్రానికి వెళ్లాలంటే ఉప్పరపాలెం రైల్వే గేటుతో తలనొప్పి తప్పడంలేదు. జమ్ములపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా పట్టణానికి చేరుకోవాలి. ఇదంతా తిరిగి వెళ్లాలంటే అధికంగా శ్రమ, సమయం, ఖర్చు వృధా అవుతోంది. పట్టణ మూడు వంతుల జనాభాలో ఒక భాగంగా ఉన్న రైలుపేట వాసుల రవాణా సౌకర్యాలను పట్టించుకునే నాధుడు లేడు. పాలకులు మారుతున్న రైలుపేట 8వార్డుల ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చేందుకు ప్రజాప్రతినిధులు సైతం ముందుకు రావడం లేదు. కాలినడక వంతెన లేకపోవడం, ఉప్పరపాలెం రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించకపోవడంతో రైలుపేట వాసులు పట్టణానికి చేరుకోవాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, మార్కెట్, వ్యాపార దుకాణాలు పట్టణంలో ఉన్నాయి. కాలినడక (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) వంతెన మీదుగా నిత్యావసరాల కోసం పట్టణానికి రాకపోకలు కొనసాగిస్తారు. రెండేళ్ళ క్రితం రైల్వే శాఖ 3, 4 ప్లాట్‌ఫాంల ఏర్పాటుకు రైల్వే లైన్లను రైలుపేట వైపు విస్తరించడం కోసం రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రైలుపేట నుండి బాపట్ల పట్టణాన్ని కలిపే (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) కాలినడక వంతెనలో సగభాగం తొలగించారు. రైలుపేట వైపు ఆటో రిక్షాల వంటి ప్రయాణ సౌకర్యాలు లేకపోవడం మరింత ఇబ్బందిగా మారింది. సాల్వేషన్ ఆర్మీ హైస్కూలులో విద్యార్థులు 10వ తరగతి వరకు చదువుకునేవారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ వ్యవస్థను రద్దు చేయడంతో రైలుపేట ప్రాంతంలోని ఆ పాఠశాల మూతపడ్డాయి. దీంతో 6, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులు, కళాశాల విద్యార్థులు వెళ్లాలంటే ప్రతినిత్యం ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థులు పలువురు ప్రత్యేక వాహనాల్లో వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేక ప్రతిరోజూ మూడు ప్లాట్‌ఫారాలు, ఆరు రైల్వే లైన్లను దాటుకుంటూ ప్రమాదకర పరిస్థితిలో వెళ్లాల్సివస్తోంది. రైలు పట్టాలు దాటుతున్న సమయాల్లో ఒక్కొక్కసారి విద్యార్థులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలినడక వంతెన పునరుద్ధరణకు పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే అధికారుల స్పందన శూన్యం



కె వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉపాధ్యాయులు, రైలుపేట

రైల్వే స్టేషన్ వద్ద కాలినడక వంతెనను పునరుద్ధరించాలని రైల్వే అధికారులకు విన్నవించిన స్పందన కరువైంది. గతేడాది అక్టోబరులో విజయవాడ డివిజనల్ రైల్వే సూపరింటెండెంట్‌ను కలిసి అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు రైల్వే అధికారులు పట్టించుకోలేదు.

ప్రజాప్రతినిధులూ పట్టించుకోలేదు



ఎ రాంబాబు, రైలుపేట

మా సమస్యలు పాలకులు పట్టించుకోవడం లేదు. రైల్వే స్టేషన్ విస్తరణలో భాగంగా తొలగించిన ఫుడ్ బ్రిడ్జిని తిరిగి నిర్మించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం లేదు. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కుంటేనే ఉన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో రైలు పట్టాలు దాటుతున్నారు. రైలుపేట వైపు నుండి ఉప్పరపాలెం గేటు ద్వారా వెళ్లాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. అండర్ పాస్‌కు అధికారులు అంచనాలు వేసి వెళ్ళారు. ఆచరణలో పనులు జరగడంలేదు. రైలుపేట వైపు ఉన్న 8వార్డుల ప్రజలు పట్టణానికి చేరుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది.


పాలకులకు పట్టని రైలుపేట వాసుల పాట్లు



చెన్నగిరి గురుబ్రహ్మం, రైలుపేట

పట్టణంలో అంతర్భాగమైన రైలుపేట పల్లెటూరుగానే మిగులుతుంది. సరైన రవాణా సౌకర్యం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే మాటలతో చెప్పలేని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రయాణ సౌకర్యం కల్పించాల్సిన పాలకుల నిర్లక్ష్యం వెంటాడుతూనే ఉంది.

పట్టాలు దాటాలంటే ప్రమాదకరం



జెన్ని నాగరాజు, రైలుపేట

ఉన్న ఫుడ్ బ్రిడ్జిని తొలగించడంతో అత్యవసర పరిస్థితుల్లో పట్టాలు, ప్లాట్ఫారాలు దాటాలంటే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఒక్కొక్కసారి ప్రమాదాలకు గురవుతున్నారు. 60ఏళ్లుగా కాలినడక వంతెనపై ప్రయాణించిన ప్రజలకు రెండేళ్ల క్రితం నుండి కష్టాలు తప్పడంలేదు. రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి తొలగించిన కాలినడక వంతెన పునరుద్ధరించాలి.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- రెవెన్యూ సదస్సులకు హాజరు కానున్న అన్ని శాఖల అధికారులు
- సదస్సుల్లో తక్షణ పరిష్కారానికి చర్యలు
- పర్చూరు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు



ఎంఎల్ఎ ఏలూరు సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వైసీపీ ప్రభుత్వంలోని భూ దందాలు, అక్రమాలను నిగ్గు తేల్చి, భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 16నుంచి సెప్టెంబరు 30వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15న జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా భూ సమస్యలపై రెవిన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా భూముల ఆక్రమణలు పెద్ద ఎత్తున జరిగాయని ఆరోపించారు. గత ప్రభుత్వ పెద్దలు అనేక మంది సామాన్య, మధ్యతరగతి ప్రజలను బెదిరించి భూములు స్వాధీనం చేసుకున్నారనే ఫిర్యాదులు అందాయని అన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రజల చెంతకు వెళ్లనున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవిన్యూ సదస్సుల నిర్వహణకు పూనుకుందన్నారు. ప్రజాక్షేత్రంలో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులకు మరో 45రోజుల గడువు ఇచ్చినట్లు తెలిపారు. తహశీల్దార్లతో పాటు ఆయా భూముల వ్యవహారాలతో సంబంధమున్న అటవీ, దేవాదాయ, ఇతర శాఖల అధికారులు సైతం ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సుల్లో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో నమోదుచేసి పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచించిందన్నారు. వైసిపి పాలనలో నిషిద్ధ జాబితా నుంచి 'ఫ్రీహోల్డ్' పేరుతో తప్పించిన భూముల రిజిస్ట్రేషన్లపైనా సమగ్ర దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. ఎసైన్డ్, చుక్కల భూములు, షరతులున్న వేల ఎకరాల భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించి వైసీపీ నేతలు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించకుండా రీ సర్వే పేరుతో అస్తవ్యస్తంగా నిర్ణయం తీసుకుందన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతన్నల కోసం, ప్రభుత్వ భూములను కాపాడేందుకు, రైతుల శ్రేయస్సు కోసం సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు.

15న సదస్సులు ప్రారంభం

గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న రెవిన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 16నుంచి సెప్టెంబర్ నెల 30 వరకు గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎంఎల్ఎ, ఎంఎల్‌సి, ఎంపీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం తీసుకుందన్నారు. భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల వివరాల సేకరణ, ఆక్రమణలు, తదితర అంశాలపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. బాధితులకు ఫిర్యాదు స్వీకరణ రసీదు ఇవ్వడంతోపాటు పరిష్కార చర్యలపై సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు


ఎంఎల్ఏను కలిసిన యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి

ప్రజాశక్తి - యద్దనపూడి

నూతన ఎస్ఐగా రత్న కుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించాలని చెప్పారు. ఎస్ఐతో పాటు యద్దనపూడి పోలీసు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

బాపట్ల : బాపట్ల మండల సిఐగా గంగాధరరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం పోలీస్ శాఖలో బదిలీల నేపథ్యంలో ఆయన రూరల్ సిఐగా వచ్చారు. ఇక్కడ సిఐగా పని చేసిన హజరత్ బాబు బదిలీపై వెళ్లారు.

బాపట్ల : బాపట్ల రూరల్ సర్కిల్ సిఐగా బి హరికృష్ణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రూరల్ సర్కిల్ సీఐగా ఆయన బాపట్లకు వచ్చారు. ఇక్కడ సిఐగా పని చేసిన శ్రీహరి బదిలీపై వెళ్లారు.



బాపట్ల సిఐ గంగాధరరావు రూరల్ సీఐ హరికృష్ణ

నిజాంపట్నం : నూతన ఎస్ఐగా కె తిరుపతిరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న ఎస్ఐ జి శ్రీనివాసరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. జె పంగలూరు ఎస్ఐగా పనిచేస్తున్న కె తిరుపతిరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడతామని అన్నారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారెవరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్ఐ తిరుపతిరావు

మెదరమెట్ల : ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా చుండూరు ఎస్ఐగా పనిచేస్తున్న షేక్ అహ్మద్ రఫీ మేదరమెట్ల ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఆయన ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ పరిదిలో శాంతి భద్రతలను కాపాడతామని అన్నారు.


ఎస్ఐ మహమ్మద్‌రఫీ

చెరుకుపల్లి : నూతన ఎస్ఐగా టి అనిల్ కుమార్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పిట్టలవానిపాలెం మండలం చందోలు ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన వై సురేష్ కొరిసపాడుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పట్టిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.


ఎస్ఐ అనిల్ కుమార్


రోడ్డుపై బైఠాయించిన ముస్లింపెద్దలు

హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి


- ఈపురిపాలెంలో ముస్లిం మత పెద్దలు ఆందోళన
- కేసు విచారణ అధికారిని మార్చాలని డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

రోడ్డు మార్గంలో అడ్డుగా ఉన్న కారును ఎందుకు నిలుపుదల చేసారని అడిగినందుకు నడిరోడ్డులో విద్యార్థిని కత్తులతో అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ముస్లిం మత పెద్దలు, నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఈపురిపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ ఆరిఫ్ (18) అనే డిగ్రీ విద్యార్థి హత్య కేసు చీరాలలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఆ కేసులో నింధితులను అరెస్టు చేయాలని, విచారణ అధికారిని మార్చాలని కోరుతూ ఆదివారం ఈపురిపాలెం సెంటర్లో ముస్లిం పెద్దలు ఆందోళనకు దిగారు. మృతుడి తల్లి, దండ్రులు సయ్యద్ ఖాదర్ అహ్మద్, సాజీదాలతో కలసి రోడ్లపై బైఠాయించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డుపై వెళుతూ అడ్డుగా ఉన్న కారును సైడ్ ఇవ్వమని అడిగినందుకు చదువుకునే విద్యార్థులపై నేర చరిత్ర కలిగిన కొందరు యువకులు కారు ఆపి విద్యార్థులతో ఘర్షణ పడి కారులో ఉన్న కత్తులతో నడిరోడ్డు పైనే హత్యకు తెగబడిన వారిని పోలీసులు ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణం అన్నారు. హత్య జరిగి రోజులు గడుస్తున్న పోలీసులు మాత్రం కేసు పురోగతి ఏమి లేకుండా కాలం వెల్లదిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే హత్య కేసులో విచారణ అధికారిని మార్చి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారుల బైఠాయించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో పోలీసులు శాంతి యుతంగా చర్చలు జరిపి ధర్నాను విరమింప చేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు 'మల్లాది' మృతి

ప్రజాశక్తి - పర్చూరు


మల్లాది లక్ష్మినారాయణ శాస్త్రి

విశ్రాంత ఉపాధ్యాయులు మల్లాది లక్ష్మీనారాయణ శాస్త్రి (101) అనారోగ్యంతో మృతి చెందారు. నిబద్ధతతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించి పర్చూరు ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. స్థానిక వైఆర్ ఉన్నత పాఠశాలలో ఆయన ఉపాధ్యాయనిగా విద్యార్థులను తన బాణీలో తీర్చిదిద్దారు. ఆయన శిక్షణలో అనేకమంది వివిధ శాఖలలో ఉన్నత ఉద్యోగులుగా, వివిధ రంగాలలో ఉన్నత స్థితిలో స్థిరపడ్డారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయం అభివృద్ధి, ఆరామ క్షేత్రం నిర్మించడంలో ప్రముఖ భూమిక పోషించారు. ఆయన ఉచితంగా హోమియో వైద్యం చేసేవారు. గ్రామస్తులు ఇతర గ్రామాల సహకారంతో త్యాగరాజ ఉత్సవాలు పర్చూరులో ఘనంగా నిర్వహించే వారు. పాఠశాల స్వర్ణోత్సవాల సందర్భంగా జాతీయ స్థాయి కళాకారులను పర్చూరు రప్పించి సంగీత కచేరీ నిర్వహించారు. మంచి సంగీతాన్ని ప్రజలకు వినిపించారు. పర్చూరు పరిసర గ్రామాల్లోని అనేక మంది విద్యార్థులు ఆయన వద్దనే చదువుకుని మంచి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. వృద్ధాప్యం వల్ల నెల్లూరులోని ఆయన తమ్ముని కుమారుడైన ప్రముఖ హోమియో డాక్టర్ ఎంఎస్ఎస్ శర్మ వద్ద ఉంటూ శనివారం మృతి చెందారు. నెల్లూరులో ఆదివారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అనేక విద్యా సంస్థలు, సంగీత సంస్థలు, దేవాలయాలు, పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన మృతి పట్ల మాజీ టెలికం జిఎం ఐ యశోద ప్రసాదు, ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాదు, కొల్లా సుబ్బారావు, న్యాయ నిర్ణేత కారుమూడి సీతారామయ్య, ఒంగోలు త్యాగరాజ మందిర నిర్వాహకులు పి రాంబాబు, చీరాల చైతన్య భారతి సాంస్కృతిక సంస్థ కార్యదర్శి భాగి నారాయణశాస్త్రి, పివిఎస్, కొల్లా సుబ్బారావు, కె రామకోటేశ్వరరావు సంతాపం తెలియజేశారు.

వ్యవసాయ అధికారి కార్యాలయం లేనట్టేనా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద గల వ్యవసాయ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రస్తుతం అధికారులు భట్టిప్రోలులోని రైతు భరోసా కేంద్రంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న కార్యాలయంలో కార్యకలాపాలు నిర్వహించిన అధికారులకు రైతాంగం నిరంతరం వచ్చి వారి పనులను జరిపించుకునేవారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు మండల కార్యాలయానికి వచ్చే పని తగ్గింది. అయినప్పటికీ మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి కార్యాలయం తప్పనిసరి. ఇప్పటి వరకు ఉన్న ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరటంతో దీనిని వదిలేసి రైతు భరోసా కేంద్రంలోనే అధికారిక కార్యకలాపాలు కొనసాగించాల్సి వచ్చింది. మండలంలో 15వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తూ ఉంటారు. గతంలో రైతులకు ఈ కార్యాలయం ద్వారానే అన్ని రకాల సేవలు కొనసాగుతూ ఉండేవి. గడిచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ఈ కార్యాలయానికి తాళాలు వేశారు. నిరంతరం రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి, ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పలు రకాల రైతు సంక్షేమ కార్యక్రమాలు ముందుకు తీసుకు వెళ్ళటానికి రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. అయినప్పటికీ అవి కూడా నిరుపయోగంగానే మారాయి.



శిథిలావస్థకు చేరిన ఎఒ కార్యాలయం

కానీ మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నూతన భవనం ఏర్పాటు కానుంది. దీనికి ప్రస్తుతం శిథిలవస్థకు చేరిన కార్యాలయ భవన స్థలం వ్యవసాయ శాఖకు సంబంధించినది కాదని, నూతనంగా భవన నిర్మాణం చేపట్టాల్సి వస్తే తప్పనిసరిగా ప్రభుత్వ స్థలం కానీ లేదా దాతలు ముందుకు వచ్చి స్థలాన్ని అప్పగిస్తే తప్ప కార్యాలయం ఏర్పడదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వ్యవసాయ కార్యాలయానికి స్థలాన్ని కేటాయిస్తే దానిలో నూతన భవనం నిర్మాణం చేపడితే రైతులకు అన్ని విదాల ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఈ మేరకు టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలోనైనా స్థల సేకరణ, నూతన భవన నిర్మాణం జరుగుతుందేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు.



భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ కార్యాలయం

నూతన ఎస్ఐకి సమస్యల స్వాగతం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం నూతన ఎస్ఐగా రానున్న ఎస్ఐ ఎం శివయ్యకు భట్టిప్రోలులో వివిధ రకాల సమస్యలు సవాళ్లుగా స్వాగతం పలుకుతున్నాయి. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న భట్టిప్రోలు గత కొన్నేళ్ళుగా కోడి పందాలు, అక్రమ మైనింగ్, రాజకీయ గొడవలకు అడ్డాగా మారింది. గత వైసిపి పాలన ప్రారంభం నుండి అక్రమ మైనింగ్ వ్యవహారం కొనసాగింది. కోడి పదాలు, ఇతర జూదాలు కూడా సంచలనం సృష్టించాయి. ఇన్ని జరుగుతున్న ఇప్పటివరకు ఇక్కడ పనిచేసి విఆర్‌కు బదిలీ అయిన కాసుల శ్రీనివాసరావు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆయన ఒక దశలో ప్రజలకు కూడా అందుబాటులో లేకపోవడమే కాక ప్రజలతో సామరస్య పూర్వక పరిస్థితిని కల్పించలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్‌ను నడిపించిన వైసిపి నాయకులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు దాఖలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ కేసులు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మాత్రమే. మండల వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందనే అపవాదులు కూడా శ్రీనివాసరావుపై ఉన్నాయి. పేరుకే ఎస్ఐగా పనిచేసిన శ్రీనివాసరావు ప్రజల ఆదరణ పొందడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఉండగా ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాజకీయ రచ్చ కూడా భట్టిప్రోలులో కొనసాగి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. టిడిపి, వైసిపిల మధ్య మాటల యుద్ధం పెరిగి చివరకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసే స్థాయికి వచ్చింది. అంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. గత వైసిపి పాలనలో ఆ పార్టీ నాయకులు టిడిపి నాయకులపై దౌర్జన్యాలు, దాడులు జరపటంతో ధర్నాలు, రాస్తారోకోలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో ఎస్ఐ శ్రీనివాసరావు తగిన చర్యలు చేపట్టడంలో వ్యఫలం చెందారనే ఆరోపణలు ఉన్నాయి. తీర ప్రాంతం కావడంతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపే ట్రాక్టర్ల నుండి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో గస్తీ నర్వహిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఎస్ఐపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. నూతన ప్రభుత్వంలో కూడా కోడిపందాలు, పేకాట స్థావరాలు కొనసాగుతున్నాయని వైసీపీ నాయకులు ఈపాటికే ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆరోపణలకు ఆధారాలు చూపాలని, బహిరంగ చర్చకు సిద్దమని టిడిపి నేతల సవాళ్లు, అందుకు తగిన ఆధారాలను చూపిస్తామని పదేపదే వైసిపి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి ఘటనలతో మండలంలో రాజకీయ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఇలాంటి తరుణంలో నూతనంగా బాధ్యతలు చేపట్టే ఎస్ఐ ఎం శివయ్యకు భట్టిప్రోలులో నెలకొన్న సమస్యలు సవాళ్లుగా మారే పరిస్థితి లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఆయన ఏ విధంగా వ్యవహరించి మండలాన్ని ప్రశాంతమైన వాతావరణంలోకి తీసుకు వస్తారో వేచి చూడాల్సి ఉంది.


పల్లెకోనలో కోడిపందాల బరి (ఫైల్)

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

డిఎం,హెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజాశక్తి కథనానికి స్పందన

జిల్లాలో సీజనల్ వ్యాధులను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'జ్వరాల పంజా' అనే కథనానికి డిఎం,హెచ్ఒ స్పందించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం లో భాగంగా ప్రతి రోజు అన్ని గ్రామాలలో జ్వరం కేసులను గుర్తించుటకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 2,98,178 మందికి మలేరియా రక్త పూతలు పరీక్షించినట్లు తెలిపారు. అందులో 13 మందికి మలేరియా పాజిటివ్ గా నిర్ధారణ అయిందన్నారు. 1,575 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా 132 మందికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణఅయినది. కలెక్టర్ ఆదేశాల మేరకు డిఎం,హెచ్ఒ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా టోల్ ఫ్రీ నెంబర్ 9515324799 ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య పనులు నిర్వహణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో పారిశుధ్య పనులను చేపట్టారు. డ్రైనేజీల్లోని మురుగు, చెత్తా చెదారాన్ని తొలగించారు. దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్ చేశారు. ఈనెల 10న ప్రజాశక్తి దినపత్రికలో 'ఫాగింగ్‌కు పాతర' అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఆకథనానికి స్పందించిన ఇఒఆర్‌డి ఈదుల రాజశేఖర్‌రెడ్డి డ్రైనేజీల్లోని ఉన్న చెత్తా చెదారం, మురుగును తొలగించే కార్యక్రమం చేపట్టారు. దోమలు ప్రభలకుండా ఫాగింగ్ యంత్రంతో వీధుల వెంట ఫాగింగ్ చేయించారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

జాతీయోద్యమ స్ఫూర్తితో

పోరాటాలు నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జాతీయోద్యమ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ ఉద్యమం – విద్యార్థి పాత్ర అనే క్లాసును ప్రసన్న కుమార్ బోధించారు. వేలాది మంది విద్యార్థులు, యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. సాతంత్ర్య ఫలాలలను కొద్దిమంది మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. కోట్లాది మంది ప్రజలు ఆకలి, అణచివేతలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రసన్నకుమార్ తెలిపారు. అందరికీ విద్యా, వైద్యం, ఉపాధి లక్ష్యంగా పోరాటాలు నిర్మించాలనిఆయన కోరారు. విభజించు, పాలించు అనే బ్రిటీష్ నినాదాన్ని నేటి బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కులం, మతం, ప్రాంతం ఆధారంగా కల్లోలాలు సృష్టించి పాలన కొనసాగిస్తుందన్నారు. మహానీయులు నడిచిన బాటలో విద్యార్థి, యువకులు నడిచి సాతంత్ర ఉద్యమ ఫలాలు సామాన్యులకు దక్కేలా పోరాడాలన్నారు. సమసమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ కు పాల్పడితే చర్యలు

బాపట్ల జిల్లా ఎస్‌పి తుషార్ డూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా




విద్యార్థులకు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అందరూ ఐక మత్యంతో మెలిగి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. విద్యా సంస్థలలో ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు, జిల్లా పోలీసు అధికారులకు ఎస్‌పి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యాలయాలు విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతాయన్నారు. విద్యనభ్యసించే విద్యార్థులు సీనియర్లు, జూనియర్లు అనే భేదాలు లేకుండా స్నేహభావంతో మెలగాలన్నారు. ఒకచోట చదువుకునే విద్యార్థులు జూనియర్ అయినా సీనియర్ అయినా స్నేహభావంతో మెలిగితే భవిష్యత్తులో ఒకరికొకరు సాయం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి వారిపై కేసు నమోదు అయితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. నూతన చట్టాల ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కసారి ర్యాగింగ్ కేసు నమోదైతే ఆ విద్యార్థి జీవితం అంధకారంగా మారుతుందన్నారు. .యాంటీ ర్యాగింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేవిధంగా కళాశాల యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. ర్యాగింగ్ ఒక వికత చేష్ట అని, దాన్ని ప్రారంభంలోనే తుంచి వేయాలని సూచించారు. పోలీస్ అధికారులు కూడా యాంటీ ర్యాగింగ్ కమిటీలో సభ్యులుగా ఉండాలన్నారు.

మూగజీవాలకు

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు
- సంచార వాహనాల ద్వారా పశు వులకు వైద్యం
- గోకులాల నిర్మాణాలకు చేయూత
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి
- డాక్టర్ ఎం. హనుమంతరావు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందిం చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు చెప్పారు. జిల్లాలో 408 రైతు భరోసా కేంద్రాలు,10 ఏరియా పశువైద్యశాలలు, 65 పశు వైద్యశాలలు, 59 లైవ్‌స్టాక్ యూనిట్ల లో వైద్యులు, వైద్య సహాయకులు. పారా వెటర్నరీ సిబ్బంది ద్వారా పశుసంవర్ధక సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలు, కార్యకర్తలు గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు

బాపట్ల జిల్లాలో 408 రైతు భరోసా కేంద్రాల ద్వారా పశుసంవర్థక సేవలు అందిస్తున్నారు. పశు వైద్య సహాయకులు. పారా వెటర్నరీ సిబ్బంది ఈ సేవలు అందజేస్తున్నారు.పశువులకు ప్రాథమిక చికిత్స, కత్రిమ గర్భధారణ, విత్తులు నొక్కుట, నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. సంపూర్ణ మిశ్రమ దాణా, పశు గ్రాస విత్తనాల పంపిణీ చేస్తున్నారు. పశు ఆరోగ్యపత్రాలు, పశు నష్ట పరిహార పథకం, పశుగణన తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

సంచార వాహనాల ద్వారా పశు వైద్య సేవలు

పశు ఆరోగ్య సేవల కోసం బాపట్ల జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున సంచార వాహనాలు కేటాయించారు. రేపల్లే, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల,వేమూరు నియోజక వర్గాలకు కలిపి మొత్తం 12 వాహనాలు కేటాయించారు. ఈ వాహనాల్లో ఒక పశు వైద్యుడు, పారా వెటర్నరి సహాయకుడు,డ్రైవర్ ఉంటారు. ఈ ఏడాది జూలై వరకూ జిల్లాలో 1,277 గ్రామాల్లో 6,324 పశువులకు చికిత్స అందించారు. అత్యవసర వైద్య సేవల ద్వారా 2,062 పశువులను కాపాడారు. జిల్లాలో 1,796 మంది పశుపోషకులు లబ్ధిపొందారు.జిల్లాలో ఆరు నియోజకవర్గ కేంద్రాల్లో పశువ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం లాబ్‌లు ఏర్పాటు చేశారు.

గోకులాల నిర్మాణాలకు చేయూత

ఉపాధి హామీ చట్టం ద్వారా గోకులాల నిర్మాణాలకు చేయూతనిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దారులకు షెడ్లు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారుల గుర్తింపు జరుగుతోంది.

ముఖాముఖి

ఎస్‌సి, ఎస్‌టి దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న రైతులు, సంచార జాతులు, పిఎంఎవై లబ్ధిదారులు, ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న రైతులు, ఒంటరి మహిళలు, చిన్నకారు, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు

లంపీ స్కిన్ వ్యాధి సోకడం వల్ల రైతులు తమ పశు సంపదను కోల్పోయే పరిస్థితులు ఉన్నాయి. క్రమంలో పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి. ఈ వ్యాధి పశువుల మధ్య అతివేగంగా వ్యాప్తి చెందు తుందన్నారు. అన్ని వయసుల ఆవు, గేదె జాతి పశువులలో ఈ వ్యాధి కనిపిస్తుంది. జోరీగలు, దోమలు, ఈగలు, పిడుదులు లాంటి రక్తాన్ని పీల్చే పురుగులు కుట్టడం ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా వుంటుంది. జిల్లాలో 27 వేల తెల్ల పశువులకు టీకాలు వేస్తున్నారు.

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత

ఔత్సాహిక రైతులు, గ్రామీణ నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో రానున్న ఐదేళ్ల కాలంలో ఔత్సాహిక రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా గొర్రెలు మరియు మేకల పెంపకం, కోళ్ల పెంపకం, పందుల పెంపకం మరియు పశుగ్రాస, దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించేందుకు అవసరమైన సహకారం అందిస్తారు.

వాహనాల లోటుపాట్లు పర్యవేక్షించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్‌పి దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగాలను ఎస్‌పి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్, ఎఆర్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, ఆయుధగారంలోని ఆయుధ సంపత్తి, మోటార్ విభాగం, వ్యాయామశాల, సిబ్బంది బ్యారక్, గార్డ్ రూమ్‌లను పరిశీలించారు. రికార్డులు నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహన నిర్వహణ, పనితీరు, కేటాయింపు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంటి సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. ఆయుధాగారంలోని వివిధ ఆయుధాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు ప్రదేశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్‌పి వెంట ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ బీమా నాయక్, , ఆర్‌ఐలు రమేష్ కష్ణన్, రమణా రెడ్డి, సీతారామిరెడ్డి,సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి కి వార్షికోత్సవ
శుభాకాంక్షలతో...
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం 1981 - 2024
సమాజం మారాలని,
సమ సమాజం రావాలని,
ప్రజా ఉద్యమాలకు వేదికగా...
ప్రతి అక్షరం ప్రజల పక్షం
నినాదంతో అక్షర సమరం
సాగిస్తున్న ప్రజాశక్తికి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పి. పరంధామరెడ్డి
విశ్రాంత ఉపాధ్యాయులు, ముప్పవరం,
పంగులూరు మండలం, బాపట్ల జిల్లా.